www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 మార్చి 2025
5
వైఎస్ఆర్

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉద్యోగ అవకాశాలను పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తామని, విద్యార్థులు విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్యులు ఎస్. రఘునాథ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. విజయభారతి ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయంలో శుక్రవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. డ్రైవ్‌ను విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యులు ఎస్. రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య రఘునాథరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలకు ప్రత్యేక శిక్షణలు ఇస్తామన్నారు. ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. 350 మంది విద్యార్థులు హాజరు కాగా డివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేసుకున్నారు.

యథేచ్ఛగా పంచాయతీ నిధులు దుర్వినియోగం

- ఎరువపాలెం పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి సస్పెన్షన్
- రూ.4.25 లక్షలు స్వాహాయత్నం
- చాపాడు కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటం

జిల్లాలో పంచాయతీ నిధుల దుర్వినియోగం పరంపర కొనసాగుతోంది. మొన్న ఒంటిమిట్ట, నిన్న వేంపల్లి, నేడు రాజుపాలెం, చాపాడు మండలాల్లో వరుసగా రూ.కోట్లాది 15వ ఫైనాన్స్, పంచాయతీ నిధుల దుర్వినియోగం పతాక స్థాయికి చేరింది. స్పందనకు వచ్చిన ఫిర్యాదులు, స్థానికుల నుంచి ఫిర్యాదుల ఆధారంగా జిల్లా పంచాయతీ అధికారులు, డివిజన్ పంచాయతీ అధికారులు చేపట్టిన విచారణ ఆధారంగా కలెక్టర్ అనుమతితో సస్పెన్షన్, క్రిమినల్ ఛార్జీలు నమోదుకు గల అవకాశాలను పరిశీలిస్తున్న వైనం విస్మయాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజుపాలెం మండలం ఎరువపాలెం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై శుక్రవారం కలెక్టర్ కొరడా ఝుళిపించారు. జిల్లా పరిషత్‌లో రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎరువపాలెం పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి బి.పుల్లారెడ్డి రూ.4,25,986లు సెల్ఫ్‌డ్రా చేశారు. గతేడాది నవంబర్‌లో స్పందనకు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా చేపట్టిన విచారణ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ చేశారు. క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించిన నేపథ్యంలో క్రిమినల్ కేసు నమోదుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. చాపాడు మండల కంప్యూటర్ ఆపరేటర్ షేక్ హనీఫ్‌బాషా ఐద్రపల్లి పంచాయతీకి చెందిన రూ.2,56,325లు దుర్వినియోగంలో చేతివాటం ప్రదర్శించారు. జిల్లా జిల్లా పంచాయతీ అధికారి జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారి, బి.కోడూరు విస్తరణాధికారి అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా విధుల నుంచి తొలగించారు. గతేడాది ఇతనిపై పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్ నమోదైనట్లు తేలింది. ఇతనిపై చేపట్టిన విచారణలో రూ.2,56,254లు ఖాదీపల్లి పంచాయతీ నిధులను సొంతానికి వాడుకోవడం తప్పేనని అంగీకరించారు. గతేడాది సెప్టెంబర్‌లో పంచాయతీ సిబ్బంది సమక్షంలో రూ.50 వేలను ఎంపిడిఒకు ఇచ్చినట్లు పేర్కొన్నట్లు గమనించారు. మరో లక్ష రికవరీ నిమిత్తం చాపాడు ఎస్ఐకి అందజేశారు. మిగిలిన రూ.1,06,254లను 15 రోజుల్లో చెల్లిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

ఐసిడిఎస్ సిడిపిఒ వేధింపులు తాళలేక
అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని కోడిగుడ్లపాడు అంగన్వాడీటీచర్ గురుదేవి పోరుమామిళ్ల పరిధిలోని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీదేవి వేధింపుల తాళలేక సూపర్‌వాస్మల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వెంటనే బంధువులు హుటాహుటినా ఆమెను పోరు మామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించి అక్కడ వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ తరలించారు. శుక్రవారం అంగన్వాడీ టీచర్ గురుదేవి ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ కోడిగుడ్లపాడు అంగన్వాడీ భవనం గత ప్రభుత్వంలో నాడు - నేడు పనుల కింద రూ. 14 లక్షలతో మంజూరైందన్నారు. అప్పటి నుంచి పైఅధికారులకు డబ్బులు ఇవ్వాలని రోజూ ఐసిడిఎస్ పీడీ రోజూ వేధించేవారని తెలిపారు. 2023 మార్చి నెలలో రూ. 10 వేలు, 2024 సెప్టెంబర్‌లో రూ. 20 వేలు ఇచ్చానని పేర్కొన్నారు. ఇంకా ఖాతాలో రూ. 22 వేలు ఉందని, అదీ కూడా ఇవ్వాలని రోజూ వేధించేవారిని వాపోయారు. తమ సెంటర్ ఐడి నెంబర్ మార్చమని అడిగితే కాలయాపన చేస్తూ తనను ఇబ్బంది పెడుతోందని పేర్కొన్నారు. ఈ వేధింపులు తట్టుకోలేకనే తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని ఆమె తెలిపారు ఈ విషయంపై సిడిపిఒ లక్ష్మీదేవిని విచారించేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆమెఅందుబాటులో లేరు.

బాధితురాలిని పర్మారిస్తున్న సిఐటియు నాయకులు మనోహర్, లక్ష్మీదేవి

చర్యలు తీసుకోవాలి : సిఐటియు

కడప అర్బన్ : పోరుమామిళ్ల ప్రాజెక్టు ఇటుకలపాడు సెక్టార్ కోడిగుడ్లపాడు సెంటర్లో అంగన్వాడీ టీచర్‌గా పని చేస్తున్న గురుదేవి ఆత్మహత్యయత్నానికి కారకులైన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గురుదేవిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అంగన్వాడీ బిల్డింగ్ కట్టడం కోసం వారికి భాధ్యత ఇచ్చారని తెలిపారు. అయితే మిగిలిన డబ్బులు వెన్నకి ఇవ్వాలని అక్కడ ఐసిడిఎస్ అధికారులు ఒత్తిడి చేసి, మానసికంగా ఇబ్బంది పెట్టే మాటలు మాట్లాడటం వల్ల ఆవేదనకు గురయ్యారని తెలిపారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

సిడిపిఒను వెంటనే సస్పెండ్ చేయాలి

కాశినాయన మండలంలో అంగన్వాడీ టీచర్లను డబ్బులు ఇవ్వాలని వేధిస్తూ ఇబ్బందికి గురి చేస్తున్న పోరుమామిళ్ల సిడిపిఒ లక్ష్మీదేవిని వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా బాధితురాలిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్లపాడు అంగన్వాడీ టీచర్ గురుదేవిని పై డబ్బులు ఇవ్వమని సిడిపిఒ వేధించడంతో ఆమె తట్టుకోలేక శుక్రవారం వాస్మల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ప్రాంతంలో అంగన్వాడీ సెంటర్లకు వచ్చే ఏ మెటీరియల్ అయినా కూడా సక్రమంగా ఇవ్వకుండా, ఒకటి రెండు తక్కువ చేస్తూ సిడిపిఒ ఆమె ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సిడిపిఒను వెంటనే తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు.

కడప మొబైల్ కోర్టులో పోసానికి ఊరట
బెయిల్ మంజూరు..కస్టడీ పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి - కడప : కడప మొబైల్ కోర్టులో పోసాని కృష్ణ మురళికి ఊరట లభించింది. పోసాని కృష్ణ మురళి బెయిల్ పిటిషన్, పోలీస్ కస్టడీ పిటిషన్‌లపై కడప ప్రత్యేక మొబైల్ కోర్టులో విచారణ పూర్తయింది. శుక్రవారం కడప ప్రత్యేక మొబైల్ కోర్టు పోసాని కృష్ణమురళికి రూ. 20వేల పూచికత్తుతో బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని సూచించింది. అలాగే పోలీస్ కస్టడీ పిటిషన్‌ను కూడా మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ డిస్మిస్ చేశారు. దీంతో అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పిఎస్ లో నమోదైన కేసులో పోసాని కృష్ణమురళి కి కోర్టు తీర్పు కాస్త ఊరట ఇచ్చింది.

వాహన చోదకులు తప్పు చేస్తే బాదుడే : ఎస్ఐ

ప్రజాశక్తి - అట్లూరు : వాహన చోదకులు తప్పు చేస్తే అధిక మొత్తంలో అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనదారులు సక్రమంగా వాహనాలు నడపాలన్నారు. ఇకనుంచి ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. నూతన వాహనదారుల వాహన చట్టంలో సవరించిన అపరాధ రుసుం వివరాలను ప్రభుత్వం పొందుపరుస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఈ సందర్భంగా తెలియజేశారు. లైసెన్స్ లేని వారికి రూ. 1000 నుంచి 5 వేల వరకు చెల్లించుకోవాల్సి వసుతందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వ్యక్తికి ఇంతవరకు రూ. 5 వందల వసూలు చేయగా, నూతన చట్ట ప్రకారం రూ. 5 వేల వరకు వసూలు చేస్తామని తెలిపారు. మైనర్ వాహనం నడిపితే రూ. 10 వేలకు వరకు వసూలు చేస్తారన్నారు.

రాయచోటి ఘటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాయచోటి ఘటనపై టిడిపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులకు ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ వినతి పత్రం ద్వారా ఫిర్యాదు అందజేశారు. ముస్లిములు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తే వారిపై మీద అక్రమ కేసులు పెట్టి భయం ప్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపైన స్పందించిన పార్టీ పెద్దలు మంతెన రామరాజు, ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వారు రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్‌తో సుధీర్ఘంగా మాట్లాడి జరిగిన వివరాలు తెలుసుకున్నారు. రాయలసీమ ఐజి, అన్నమయ్య ఎస్‌పి మాట్లాడి వెంటనే ఇరు వర్గాల మత పెద్దలను పిలిచి సమస్యను పరిష్కరించాలని, అక్రమ కేసులను ఎత్తి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కోశాధికారి అబ్దుల్ కలాం, ఉపాధ్యక్షులు మౌలా బేగ్ మహిళా అధ్యక్షులు సయ్యద్ మెహతాజ్ బేగం, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మన్సూర్ అలీ ఖాన్, రాయలసీమ ఇన్‌ఛార్జి అలీ షేర్, కోర్ కమిటీ సభ్యులు నూర్‌ఖాన్, మొహమ్మద్ హాజీ హుస్సేన్, సయ్యద్ హుస్సేన్, షేక్ ఖలీల్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె: మండల పరిధిలోని జె. కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి నిర్వహించే 10వ తరగతి పరీక్షలలో హాజరయ్యే ఏపీ టి డబ్ల్యూ ఆర్ ఎస్ పాఠశాలలోనీ బాల బాలికలకు రాష్ట్ర కమిటీపిలుపుమేరకు 5 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోని దాదాపు 83 మంది విద్యార్థులకు పరిక్ష సామగ్రిని కడప జిల్లా అధ్యక్షులు ఎస్. గంగాధర్ ఆధ్వర్యంలో అందజేశామన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 'జాతీయ లోక్ అదాలత్' నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 3, రాయచోటిలో 2, బద్వేల్‌లో 2, జమ్మలమడుగులో 1 బెంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562 - 258622, 244622లలో సంప్రదించాలన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్నప్పుడు మహిళలు హెల్ప్ లైన్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలని మహిళా శిశు సంక్షేమ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో మహిళా సాధికారత విభాగంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ 1098, 181 హెల్ప్ లైన్, వన్ స్టాప్ సెంటర్, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి మొదలగు వాటి గురించి విపులంగా విశదీకరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాటాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో విద్యార్థులు అందరూ కూడా అధునాతన సాంకేతిక సౌకర్యాలను వినియోగించుకుని వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు డాక్టర్ కల్పన, డాక్టర్ సావిత్రి, అనిత, షాహిన్, కృష్ణవేణి, రాధిక, రేణుక, సునీత, లావణ్య, డాక్టర్ అపర్ణ, దీప్తి, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ డి. శ్రీలక్ష్మి

శాశ్వత నియామకాలు చేపట్టాలి

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ రంగ బ్యాంకులలో తక్షణమే అన్నీ కేడర్లలో శాశ్వత నియామకాలు చేపట్టాలని కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి సి. శ్రీనివాసుల రెడ్డి డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ సెంట్రల్ కమిటీ పిలుపుమేరకు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం ఏడురోడ్ల సర్కిల్ వద్ద యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ అజీజ్ నాయకత్వంలో అన్ని బ్యాంకుల ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రధాన కార్యదర్శి సి. శ్రీనివాసుల రెడ్డి ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లా డారు. తక్షణమే అన్ని కేడర్లలో శాశ్వత నియామకాలు చేపట్టా లని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఐదు రోజు ల పని దినాలను వర్తింపజేయాలన్నారు ఈ డిమాండ్లను సాధించే క్రమంలో ఈ నెల 24, 25 తేదీలలో రెండు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈనెల 18న సిఎల్‌సి వారు యూనియన్ లను, ఐబిఎ, బ్యాంకు మేనేజ్మెంట్లను చర్చలకు ఆహ్వానించిందని తెలిపారు.

నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

గురువుల ఘర్షణ

- మహిళా టీచర్‌పై పిజిటి దాడి
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- పిజిటి సస్పెన్షన్
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం కూడా..
- దాడులు చేసుకుంటే చర్యలు తప్పవు
- డిఇఒ షంషుద్దీన్

ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళా టీచర్లు

ప్రజాశక్తి-వేంపల్లె

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారు.. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేయాల్సిన ఉపాధ్యాయులే ఘర్షణ పడ్డారు. మహిళా టీచర్లపై పిజిటి ఉపాధ్యాయుడు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డాడు. విద్యార్థుల ఎదుటే ఒకరినొకరు దుర్భాషలాడుకుంటూ వీధిన పడ్డారు. చివరికి వారి పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు దారి తీసింది. ఈ సంఘటన వేంపల్లెలోని తల్లిశెటి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. మహిళా ఉపాధ్యాయుల వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం పిజిటి గురునాథ్‌రెడ్డి తన కారును వేగంగా నడుపుకుంటూ పాఠశాలకు వచ్చాడు. బాలికల పాఠశాల ఆవరణంలో మహిళా ఉపాధ్యాయులను ఆనుకొని కారును పోనిచ్చాడు. దీంతో వారు గురునాథ్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇలా ఒకరినొకరు దూర్భాషలాడుకున్నారు. అ తర్వాత పిజిటి పాఠశాలలోని ఆఫీసులోకి వెళ్లి నాగాంజలి అనే హిందీ ఉపాధ్యాయురాలిని కాలితో తన్నడంతోపాటు క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు ప్రభావతిని గొంతు పట్టుకొని నెట్టాడు. అలాగే ఫిజికల్ సైన్స్ సహాయ ఉపాధ్యాయురాలు సునీతను కూడ గుద్దడంతో పాటు అసభ్య పదజాలంతో తిట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం గురునాథ్‌రెడ్డిని శిక్షించాలని మహిళా ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు గురునాథరెడ్డి ద్వారా జరిగినట్లు మహిళా ఉపాధ్యాయులు ఆరోపించారు. భద్రతా లేని పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు పని చేయాలంటే భయంగా ఉందన్నారు. ఈ సంఘటనపై పాఠశాల హెచ్‌ఎంను వివరణ కోరగా తనకు విషయం తెలియదని, పాఠశాలకు వచ్చేలోపే ఘర్షణ చోటు చేసుకుందని, ఎవరూ తన మాట వినడం లేదని పేర్కొన్నారు. తనకు చెప్పకుండానే పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిపోయారని తెలిపారు. గురునాథ్‌రెడ్డి కూడా సంతకం చేసి పాఠశాల నుంచి ఎక్కడికో వెళ్లి పోయాడు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి షంషీద్దీన్, డిప్యూటీ డిఇఒ మీనాక్షి ఇరువురు కలిసి వేంపల్లెలోని పాఠశాలకు వచ్చి జరిగిన విషయంపై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఘటనపై పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, గురునాథ్‌రెడ్డి బాధ్యత వహించాలని తెలిపారు. హెచ్‌ఎం ప్రోత్సాహంతో పిజిటి తీవ్ర అనుచిత ప్రవర్త ప్రదర్శించినట్లు విచారణలో తెలిందని డిఇఒ చెప్పారు.

పిజిటి, హెచ్‌ఎం సస్పెన్షన్

క్రమ శిక్షణ చర్యలో భాగంగా జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పని చేస్తున్న పిజిటి గురునాథ్‌రెడ్డిని ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం నారాయణమ్మను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షంషీద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపి సివిల్ సర్వీసెస్ రూల్స్ 1966 జీవో ప్రకారం నిబంధనలను ఉల్లంఘించడంతో పిజిటిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కొంత కాలం నుంచి బోధన పరంగా గురునాథ్‌రెడ్డికి మహిళా ఉపాధ్యాయులు సునీత, ప్రభావతి, నాగాంజలీలకు మనస్పర్థలు తలెత్తాయన్నారు. అప్పుడప్పుడు ఇరువురు వాదులాటూ వచ్చారన్నారు. ఈ నేపథ్యంలో మహిళ ఉపాధ్యాయునులపై గురునాథ్‌రెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఘర్షణకు కారణమైన వారు ఎవరైనా సరే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయులే ఇలా ఘర్షణ పడడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. పిజిటి ఉపాధ్యాయుడు మహిళా ఉపాధ్యాయులపై దాడి చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం నారాయణమ్మను ఆర్‌జెడి శ్యామ్యూల్ సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం అందరిని కలుపుకొని వెళ్లాలని, ఉపాధ్యాయుల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత హెచ్‌ఎంపై ఉందని చెప్పారు. కానా పరిస్థితి వేరే విధంగా ఉండడంతో ఘర్షణకు కారణమైన వారిపైన కూడ చర్యలు తీసుకొంటామని చెప్పారు. ఇంకోసారి దీనికి సంబంధించిన వాటిపై పిర్యాదులు వస్తే శాఖ పరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేస్తామని డిఇఒ హెచ్చరిం చారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్నం భోజనంపై, బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిఇఓ వెంట ఎంఇఒ స్టాలిన్ ఐజాక్, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నరెడ్డి సంగమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణ పనులు పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నిటిని ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణానికి ఎంతో ప్రాదాన్యతనిస్తున్న దృష్ట్యా జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టుల జాతీయ రహదారుల భూసేకరణకు సంబంధించి అవరోధాలను అధికమించి పనులు వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. టైటిల్ వివాదాలు, రెవెన్యూ భూ వివాదాలకు సంబంధించి ఓపెన్ ఫోరం ఏర్పాటు చేసి గ్రామాల వారిగా ప్రజలతో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జాతీయ రహదారి భూసేకరణ పనుల పురోగతి పై ఆయా పనుల వారిగా అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఎన్ హెచ్‌ఎఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణరెడ్డి, ఆర్‌అండ్‌బి ఇఇ, నేషనల్ హైవేస్ అధికారులు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేల్ ఆర్‌డిఒలు చెన్నయ్య, సాయి శ్రీ, చంద్రమోహన్, అధికారులు పాల్గొన్నారు.

ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధం
- కమిషనర్ మనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

దైనందిన జీవితంలో వాణిజ్య ప్రాంతాలు, పరిశ్రమలు, ఇంధన పైప్‌లైన్, పలు రసాయనాలు, ఉత్పాదక కేంద్రాల్లో ఊహించని ఎలాంటి విఫత్కర ప్రమాదాలనైనా తక్షణమే చేదించేందుకు జిల్లా విపత్తుల నిర్వహణ, ఫైర్ సిబ్బంది అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. 54 జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కడప నగర శివారు ప్రాంతం బలిజపల్లి పరిధిలోని హెచ్‌పిసిఎల్ (హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) కు సంబంధించిన విడిపిఎల్ (విజయవాడ - ధర్మపురీ పైప్ లైన్) చైనేజ్ పైప్ లైన్ - 391 వద్ద నిర్వహించిన ఇఆర్‌డిఎంపిఆఫ్ సెట్ మాక్ డ్రిల్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. డ్యామేజ్, లీకేజీ సమయంలో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టాలి అన్న విషయంపై జిల్లా విపత్తుల మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విఫత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్ పర్ మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతోనే కలెక్టర్ రి ఆదేశాల మేరకు ఆఫ్ సైట్ ప్రయోగాన్ని ఒక ఎస్‌ఒపి ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో ఎప్పుడైనా అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే ఎదుర్కొనే ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపి ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేసాయన్నారు. ప్రమాద ఘటనలో నివారణోపాయాలకు ఉపయోగించే పరికరాల పరిశీలన, ప్రమాద కారకాలను గుర్తించే డిటెక్టర్ టీమ్ తనిఖీల ప్రక్రియలను సేఫ్టీ అధికారులు అత్యంత ప్రావీణ్యతతో చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ కలకడ బూస్టర్ స్టేషన్ చీఫ్ స్టేషన్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు, కడప డిప్యూటీ జెనరల్ మేనేజర్ ఓబయ్య, మేనేజర్ పి. శ్రీకాంత్, సీనియర్ మేనేజర్లు జె. నాగార్జున రావు, గౌతమ్ కుమార్, అధికారులు, హెచ్ పిసిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి ఎఒ, డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

పులివెందుల నియోజకవర్గం, వేంపల్లి మండలం ఇడు పులపాయి ట్రిపల్ ఐటిలో ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న రామ సుబ్బారెడ్డిని తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. శుక్రవారం జిల్లా లేబర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఉద్యోగిని అ కారణంగా తొలగించిన ఎఒ రవికుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఫ్యాకల్టీ అనిల్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటి అధికారులు ముగ్గురు స్వీపింగ్ వర్కర్లకు మెమోలు ఇచ్చి బెదిరించారని తెలిపారు. వాటిని ప్రశ్నించినందుకు సంబంధం లేకుండా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్న రామసుబ్బారెడ్డిని తొలగించడం దారుణమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ ఉద్యోగుల యూనియన్ నాయకత్వం అనేకసార్లు డైరెక్టర్, ఎఒకు తెలిపినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. నిర్లక్ష్యం వహించడమే కాకుండా పిల్లలు కూడా రక్షణ లేని పరిస్థితుల్లో ట్రిపుల్ ఐఐటి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన ఎఒ, డైరెక్టర్ పట్టించుకోకుండా ఆదాయమే పనిగా పనిచేస్తున్నారని విమర్శించారు. విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడు, రక్షణగా ఉండే విధంగా ఏవో డైరెక్టర్ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కాని వాటిని పట్టించుకోకుండా ఆదాయం సంపాదించుకోవడం ఎలా, బెదిరించడం ఎలా, తీసేయడం ఎలా అని ఆలోచన తప్ప, మంచి చేయాలనే ఆలోచన లేదని విమర్శించారు. ఇప్పటికైనా తొలగించిన రామసుబ్బారెడ్డిని వెంటనే విధుల్లోకి తీసుకుని, వీటికి కారకులైన ఎఒ రవికుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, అలాగే ఫ్యాకల్టీ అనిల్ కుమార్‌రెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు . అనంతరం ఎసిఎల్ కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, నగర అధ్యక్షులు రవి, నాగేంద్ర, రామసుబ్బారెడ్డి, ఎల్లయ్య,రంతు, ప్రభాకర్ రెడ్డి, ఉదయ్, విజయ్, మహేష్ కాసిం, నూరు, జాషువా, ప్రసాదు, రామకృష్ణ ,చెన్నయ్య, అఖిల్, కుతుబ్, బాలచంద్ర, పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

రంజాన్ మాసం పవిత్రమైనది

ప్రజాశక్తి కడప అర్బన్

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరి లోకేష్ అన్నారు. శుక్రవారం టిడిపి ఎన్నారై కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహ, శేఖర్, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ మీడియా కో- ఆర్డినేటర్ విశ్వనాథ్, నాయకులు ఇర్ఫాన్, ప్రభాకర్, రాజా రత్నం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రొక్లెయిన్‌తో భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

అనుమతి తెచ్చుకునేంత వరకూ

కూల్చివేతలు ఆగవు

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని జ్యోతి క్షేత్రంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి అనుమతి తెచ్చుకునేంతవరకు ఇక్కడి అక్రమ కట్టడాలు కూల్చివేతలు ఆగవని పోరుమామిళ్ల రేంజ్ ఆఫీసర్ వై. రఘునాథరెడ్డి, పోరుమామిళ్ల సిఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు భారీ బందోబస్తుతో జెసిబిలతో అధికారులు జ్యోతి క్షేత్రానికి చేరుకున్నారు. మొదటగా కొన్ని భవనాలను కూల్చివేశారు. అనంతరం ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన శివరంగారెడ్డి అనే వ్యక్తి జ్యోతి క్షేత్రంలో తమ సొంత డబ్బుతో అక్రమంగా ఒక గెస్ట్ హౌస్‌ను భారీ ఎత్తున నిర్మించుకున్నారని, తొలగించేంతవరకు ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ నుంచి కదిలేది లేదని ఫారెస్ట్ అధికారులు తెగేసి చెప్పారు. అక్కడున్న కొంతమంది భక్తులు పోలీసులను, రేంజ్ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈనేపథ్యంలో స్థానికులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గతంలోనూ రెండు, మూడు పర్యాయాలు కొన్ని భవనాలు తొలగించామని, ఇంకా అనుమతి తెచ్చుకోకుండా కాలయాపన చేస్తే రాబోయే రోజుల్లో ఇబ్బంది పడతారని అటవీశాఖ అధికారులు చెప్పారు.

నిరుద్యోగ యువతకు పిఎం ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

చదువుకున్న నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం ఇంటర్న్ షిప్ పథకం మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.వి. ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో యువకులతో ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ పథకం ఏర్పాటు చేశారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారి విద్యఅర్హతను బట్టి కంపెనీ సెలెక్ట్ చేసుకుంటుందని, ఏడాది పాటు ట్రైనింగ్ ఇస్తారని చెప్పారు. శిక్షణ కాలంలో ప్రతినెలా రూ. 5 వేలు స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. తరువాత కంపెనీలో ఉద్యోగ అవకాశం కూడా లభిస్తుందని వివరించారు. ఈనెల 12న దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. స్థానికంగా ఉన్న 28 మంది కార్మికులకు ఈ -శ్రమ్ లేబర్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నారని, మంజూరయ్యాక లింకు పంపిస్తామని, కార్డును కంప్యూటర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షల వరకు ఇన్సూరెన్స్ ఉంటుందని తెలిపారు. అవగాహన ఉంటే మొబైల్ ద్వారా కూడా ఈ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్మికులకు అవసరమైన ఈశ్రమ్ కార్డులను సచివాలయంలో చేయడం లేదని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు రాధాకృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. ఇంటర్నెట్ సెంటర్‌కు వెళితే రూ. 100 నుంచి రూ. 150 వరకు డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. చాలామంది కార్మికులు పట్టణంలో ఉన్నారని ఒక కౌంటర్ ఏర్పాటు చేసి అందరికీ ఈ- శ్రమ్ కార్డులు చేయించాలని అధికారిని కోరారు.

జాతి జాగృతికి జనని పాత్ర కీలకం

ప్రజాశక్తి- కడప సిటీ

జాతిని జాగృతం చేయడంలో జనని పాత్ర కీలకమైందని, కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జి ధనలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ అన్ని రంగాలలో మగువలు తెగువ చూపుతున్నారని అన్నారు. ఒక దీపం వెయ్యి దీపాలను వెలిగిస్తుందన్నట్లు విద్యావంతురాలైన మహిళ యావత్తు వంశానికే వెలుగునిస్తుందని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళుతూ మరింత చైతన్యంలో గుర్తింపును ఆశిస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీలు అనేక రంగాలలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగిందన్నారు. కుటుంబ బాధ్యతలతో పాటు, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంలో మహిళలు పురుషులకు దీటుగా బాధ్యత నిర్వహిస్తున్నారని అన్నారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు : పాడి రైతులు ఆవులు, గేదెలకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. కొత్తపల్లిలో శుక్రవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. .పెయ్యి దూడలకు బ్రూసెల్లా టీకాలు వేసినట్లు చెప్పారు.సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప రోడ్డు, ముద్దనూరు రోడ్డు వేంపల్లి రోడ్డు, రానివనం, వినాయకనగర్, సుందరయ్య నగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్ ఏరియా లలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని పేర్కొన్నారు.

ఉచిత డిఎస్‌సి కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి గాను మెగా డిఎస్‌సి ప్రకటించిన నేపథ్యంలో కడపలో పేద ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ ఇప్పించడానికి కడప కేంద్రంగా ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి కోరారు. శుక్రవారం మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కి వినతి పత్రం అందజేశారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

ఈనెల 12న విజయవాడలో నిర్వహించబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గోవింద్, గండి సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో మహా ధర్నాను కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కోట్ల మంది పేదలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వారికి సొంత ఆస్తులు లేక చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు లేక పొట్టకూటి కోసం ఏ పని దొరికితే ఆ పనికి వెళ్తున్నారని చెప్పారు. డిగ్రీ పీజీ చదువుకున్న విద్యార్థులు ఆటో, భవన నిర్మాణ, ఉపాధి పనులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఆ పనుల్లోనూ పోటీ పెరిగి చేతినిండా పని దొరకక సుధూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వారు అన్నారు. ఇటీవల అనంతపురం, పల్నాడు, సత్య సాయి, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో పనికి వెళ్లి వస్తుండగా కూలీలు పెద్ద సంఖ్యలో ప్రమాదంలో చనిపోతూ ఉంటే వారి కుటుంబాలు దిక్కులేని అనాధల్లా తయారవుతున్నారు. ఇంత దారుణమైన పరిస్థితి పేదలు ఎదుర్కొంటున్న వీరి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం హక్కుల సాధన కోసం పేదలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో గురు బ్రహ్మాచారి, శ్రీనివాసులు, ఆంజనేయులు, అరవింద్ లు పాల్గొన్నారు.

15లోపు పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో ఈ నెల 15లోపు ఆస్తి, ఇంటి, నీటి పన్నులు చెల్లించాలని కమిషనర్ శేషఫణి తెలిపారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు పన్నులు కట్టని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి అడగాలని తెలిపారు. ఈనెల 16 నుంచి పన్నులు చెల్లించని ఆస్తులను సీజ్ చేస్తారన్నారు. గడువులోపు పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని పన్నులు చెల్లించాలనుకునేవారు కట్టవచ్చని తెలిపారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి : జెసి

కడప అర్బన్ : కెఎల్‌ఎం కళాశాలలో మాట్లాడుతున్న జెసి అదితిసింగ్

ప్రజాశక్తి -కడప అర్బన్

మహిళలు ఆత్మవిశ్వాసంతో పని చేయాలని జెసి అదితి సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కెఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కె ఎల్ ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అడ్డంకులను అధిగమించి ముందుకు సాగాలని కోరారు. ఇప్పటికీ మహిళలపై జరుగుతున్న అఘయిత్యాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో 49 శాతం వున్న మహిళలు ముందడుగు వేయాలని కోరారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ప్రతి మహిళా ముందడుగు వేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ మాట్లాడుతూ మహిళలకు కల్పించిన స్వతంత్ర్యం సరిఅయిన రీతిగా ఉపయోగించు కోవాలని కోరారు. మహిళలు నైతిక విలువలు కలిగి ఉండాలని కోరారు. కరస్పాండెంట్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు చైతన్యం కలిగి ఉండాలని కోరారు. ఆ తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

సాధిస్తాం...శాసిస్తాం!

ఆది నుంచి ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించగలిగామని, ఇక తామే ఆ అధికారాన్ని చేతులకు తీసుకుని శాసించే స్థితికి చేరుతామన్న నమ్మకముందని మహిళా దినోత్సవ సభలో వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఇంటాక్, లయన్స్ క్లబ్, ఎస్‌సి ఇంజనీరింగ్ కళాశాల, జన విజ్ఞాన వేదిక, పిఎంఎఫ్ సంస్థల ఉమ్మడి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌పి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీ పాత్ర విరోచితమైందని, తాను ఎన్ని కష్టాలు అనుభవించినా దేశం కోసం, తన వారికోసం ఆనందంగా భరించి అనుకున్నది సాధించే పట్టుదల మహిళలకు ఉంటుందన్నారు. సమాజం సజావుగా నడవాలంటే స్త్రీ, పురుషులు సమాన బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ మానవ జాతి మనుగడ మహిళపైనే ఆధారపడి ఉందని, ఆమె త్యాగాలు వెలకట్టలేనివని, పురుషుని జీవితం కూడా ఆమెపైనే ఆధారపడి ఉందన్నారు. వ. డాక్టర్ ఆదూరి శకుంతల మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ధృడత్వాన్ని మహిళలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ లేని మానవ లోకాన్ని ఊహించుకోలేమన్నారు. ఉపాధ్యాయ సంఘ నేత శ్రీనివాసులురెడ్డి, వైవీయూ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ ఆడిటర్ షరీఫ్‌ఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, సైకాలజిస్టు ఓవీ రెడ్డి, మారుతిప్రసాద్, డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి తదితరులు కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన కేకును ఇంటాక్ మహిళా సభ్యులందరూ ఆచార్య పుత్తా పద్మతో కలిసి కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సంస్థ పక్షాన విద్యార్థులందరికీ కూడా కేక్‌ను పంచి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తె లిపారు. అనంతరం ఇంటాక్ మహాసభ సభ్యులందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ప్రజాశక్తి- కడప సిటీ : సమాజంలో మహిళలు అని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి ప్రత్యేక స్థానం ఉందని, ఎల్లవేళలా వారిని గౌరవించాలని కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డిప్యూటీ కలెక్టర్ యు. రంగస్వామి అన్నారు. ప్రభుత్వ డాక్టర్ అసోసియేషన్ రిమ్స్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలను శుక్రవారం కడప ప్రభుత్వ వైద్యశాల కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఎంఇ, జిఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ మాట్లాడుతూ ప్రతి మనిషికి మాతృ స్థానంలో మహిళ ఉంటుందన్నారు. ప్రధానంగా కడప రిమ్స్‌లో వైద్య రంగంలో వైద్యులుగా, అధికారులుగా, వైద్య సిబ్బంది గా విధులను నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ మాట్లాడుతూ మహిళలు అనేక విజయాలు సాధిస్తున్నారన్నారు. కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులే ఎక్కువ మంది ఉన్నారన్నారు. ఈ ఏడాది హెల్త్ యూనివర్సిటీ స్థాయిలో కడప రిమ్స్ జనరల్ మెడిసిన్ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ విరాజిత టాపర్‌గా నిలిచి ప్రత్యేక స్థానాన్ని అందుకున్నారన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ రమాదేవి, సిఎస్‌ఆర్ఎంఒ డాక్టర్ ఎస్ ఆర్ రాజేశ్వరి, మైక్రోబయాలజీ హెచ్ఒడి డాక్టర్ నాగశ్రీలత, డాక్టర్ రజిని, వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప : సన్మానం అందుకుంటున్న రిమ్స్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ముద్దనూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎంపిడిఒ ముకుందారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు ఎంపిడిఒ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి పరిపూర్ణ అరుంధతి,సిబ్బంది కుమారి,సుబ్బమ్మ, రంగనాయకమ్మ,లక్ష్మి, కో-ఆర్డినేటర్ కరిమున్నీసా బేగం పాల్గొన్నారు. కడపలో జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

ప్రజాశక్తి - వేంపల్లె : నేటి మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమని, అందుకు అనుగుణంగా కృషి చేయాలని స్థాని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రజిత పేర్కొన్నారు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రజిత మాట్లాడుతూ మదర్ థెరిస్సా, ఝాన్సీ లక్ష్మీబాయి, కల్పన చావ్లా, ద్రౌపదిముర్ము వంటి ఎందరో వీర మహిళల జీవితాలు ఆదర్శమన్నారు. మహిళలు వివిధ సేవలతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఉమెన్ ఎంపవర్మెంట్ కో- ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ సమాజ, కుటుంబ సేవల్లో మహిళల పాత్ర ఎనలేనిదని చెప్పారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు ఎస్ఐ శ్రీనివాస మూర్తి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, అధ్యాపకులు కిరణ్మయి, డాక్టర్

జమ్మలమడుగు రూరల్ : సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

మల్లేశ్వరమ్మ, కేశమ్మ, రేష్మ, గంగాధర్, మాధవరావు, సుధాకర్, రాజారెడ్డి, అరవింద్, వినోద్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : సమానత్వం తోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జెవివి జిల్లా అధ్యక్షులు సురేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు అవకాశం ఇస్తే రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లోనూ స్త్రీలు సమున్నత స్థానాల్లో విశిష్ట కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉత్పత్తి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు సరైన అవకాశాలు ఇస్తేనే మహిళలు అభివృద్ధిని ఇస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. మహిళలకు పని ప్రదేశాలలో భద్రత లేకపోవడం వివక్షకు గురవడం నిత్య కృత్యం అయిందన్నారు. మారిన ఆర్థిక పరిస్థితుల్లో మహిళలు పనిచేయకపోతే కుటుంబం గడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. . మహిళలను వ్యాపార వస్తువుగా చిత్రీకరించే సినిమాలను వ్యాపార ప్రకటనలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాలసుబ్బయ్య, రాఘవ, మహిళా సంఘం ప్రొద్దుటూరు కార్యదర్శి వెంకటసుబ్బమ్మ అధ్యక్షులు సర్వేశ్వరి, రాములమ్మ ,నాగలక్ష్మి ,లక్ష్మీదేవి ,జయమ్మ, పుష్పలత కళావతి ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగు పాత బస్టాండ్ సర్కిల్‌లో సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ముందుస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై అవగాహన కల్పించే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించారు. సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ కల్పించడానికి సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల ఎన్సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ రాజు, కళాశాల అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించడం, మహిళలపై హింసను వ్యతిరేకించడం, సమాజంలో అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

వేంపలె : సన్మానం పొందిన మహిళలు

బాలాజీ హైస్కూల్ లో ... స్థాని బాలాజీ హైస్కూల్‌లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఏర్పాటు చేశారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి, ఎ ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సూర్యమిత్ర, ప్రిన్సిపల్ శిరీష, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

బాలికలను విద్యావంతులను చేస్తే, దేశం శక్తివంతంగా తయారవుతుందని అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి భాగ్యమ్మ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పి. బొమ్మేపల్లిలోని ఎంపియుపి పాఠశాలలో అంగన్వాడీ యూనియన్, సచివాలయ మహిళా ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు సంయుక్తంగా బేటి బచావో బేటి పడావో, బాల్య వివాహాల నిర్మూలనా బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాల వయసు రాకముందే వివాహం చేయడం చట్ట ప్రకారం నేరం అన్నారు. ముఖ్యంగా బాలికల ఆరోగ్యం, విద్యావకాశాలను దెబ్బతీయడం, హక్కుల ఉల్లంఘన, ఆడుకుంటూ ఆహ్లాదంగా సాగిపోయే చిన్నారుల బాల్యాన్ని చిదిలం చేసే బాల్య వివాహాలను అంతం చేయడానికి బాలికల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు రూపొందించి విశేషంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. సచివాలయ మహిళా పోలీస్ గురుదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం బాల్య వివాహాల నిషేధ చట్టం 2006ను అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం బాల్య వివాహాలను నిషేధించడం, బాధితులకు రక్షణ కల్పించడం, వారిని ప్రోత్సహించడం వంటి నిబంధనలతో పకడ్బందీగా ఉందన్నారు. కార్యక్రమ లో సిఐటియు ఉపాధ్యక్షులు ఎ.వినయ్ కుమార్, బొమ్మేపల్లి సచివాలయం సోషల్ వెల్ఫేర్ బి.నాగజ్యోతి, ఎంపియుపి స్కూల్ ఉపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, కె. మురళి, పి.జయనారాయణమ్మ, అంగన్వాడీ కమిటీ సభ్యులు కె. నాగ మునింద్ర కుమారి, యు.లక్ష్మికళ, షాలిని, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మహిళలు అని రంగాలలో ముందంజలో ఉండాలని ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నిడివెలగల సమీపంలోని కస్తూరిబా పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల నాయకత్వ స్థానాల్లో ఎదుర్కొంటున్న సవాళ్ళు, జెండర్ సమానత్వం పై ఆవశ్యకత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం పెద్దపీట వేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తోందన్నారు. మహిళా సాధికారికతతోనే అన్ని రంగాలు ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం అన్ని రంగాలలో సైతం పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గురుదేవి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మహిళా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

న్యాయవాదుల నియామకం

ప్రజాశక్తి - కడప : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ లీటల్ ఎయిడ్ కౌన్సిల్ సిస్టమ్ న్యాయావదులను శుక్రవారం నిరయమించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్లుగా ఎమ్ శాంత, ఎం.వినయ్ కుమార్, ఎం. చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్లుగా పి.మనోహర్, ఎం సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఏ.ఎస్.రవితేజ, పి. ప్రవీణ్ కుమార్ నియమించబడ్డారు. వీరు కోర్టులలో లీగల్ ఎయిడ్‌కు సంబంధించినటువంటి క్రిమినల్ కేసులను పరిష్కరిస్తూ ఉంటారు. న్యాయవాదిని నియమించుకోలేని ఆర్థిక స్తోమత లేని వారు వీరిని సంప్రదించి ఉచితంగా న్యాయవాది సాయం తీసుకోవచ్చు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

ప్రజాశక్తి - వల్లూరు : మండలంలోని అంబవరానికి చెందిన చిన్న చెంచు గారి పుల్లమ్మ (65) శుక్రవారం గుండె నొప్పితో మృతి చెందినట్లు ఎపిఒ సుధారాణి తెలిపారు. ఉపాధి కూలీ చిన్న చెంచు గారి పుల్లమ్మ శుక్రవారం ఉపాధి పని చేస్తూ గుండెల్లో నొప్పి అనిపించి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఇంట్లోనే మృతిచెందినట్లు ఎపిఒ పేర్కొన్నారు.

జడ్‌పి మాజీ చైర్మన్‌కు పరామర్శ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దేవిరెడ్డి జ్యోతిరెడ్డిని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఇటీవలే రెండు మోకాళ్ల కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకొని పులివెందులలోని ఆమె నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను తులసిరెడ్డి పరామర్శించారు. జ్యోతి రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. భాస్కర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నాగరాజు, తమ్మిశెట్టి వెంకటేష్, అమర్, ఉత్తన్న, రాజు, ఐచర్ రమణ ఉన్నారు..

సోలార్ ఎనర్జీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు సోలార్ ఎనర్జీలో సోలార్ పివి ఇన్‌స్టాలర్- సూర్యమిత్ర వృత్తి విద్యా కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తున్నారని ఐటిఐ, డిప్లొమా, బిటెక్ పాస్ అయిన అభ్యర్థులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ నాక్ సంస్థలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ యం.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ సహకారంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ లో శిక్షణ పొందడానికి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సుమారు 90 రోజులపాటు శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తారని తెలిపారు.

పోరాటానికి మద్దతుగా నిలవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వెటర్నరీ జూనియర్ డాక్టర్లు స్టయిఫండ్ పెంచాలని చేస్తున్న సమ్మెకు సమాజ మద్దతుగా నిలవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతర వైద్య కోర్సులైన ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుర్వేద, హోమియోపతి కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న జూనియర్ డాక్టర్లకు నెలకు రూ. 25,000 పైగా స్టయిఫండ్ వస్తుందని, వెటర్నరీ జూనియర్ డాక్టర్లకు నెలకు కేవలం రు. 7,000 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇతర వైద్య కోర్సులలో పీజీ విద్యార్థులకు నెలకు రు.64,000 వస్తుండగా పీజీ వెటర్నరీ విద్యార్థులకు 9,000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. వెటర్నరీ స్కాలర్లకు రూ.10,000 మాత్రమే వస్తుందని తెలిపారు. వారు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లోని వెటర్నరీ జూనియర్ డాక్టర్లకు రూ.14 వేల నుండి రూ.24వేల వరకూ స్టయిఫండ్ వస్తుందని తెలిపారు. 12 సంవత్సరాల నుండి వెటర్నరీ విద్యార్థుల స్టయిఫండ్ సవరించలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, పట్టణ ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు.

గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సిఐ యుగంధర్ తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణ ంలోని ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్‌లలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్, ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం సంయుక్త తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్‌పి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు పట్టణంలో ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాలు, గోడౌన్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. శుక్రవారం మండలంలోని పాములూరు గ్రామానికి చెందిన దేవిరెడ్డి మురళి మోహన్‌రెడ్డికి చెందిన దేవిరెడ్డి శివ మస్తాన్ రెడ్డి జయంతి సందర్భంగా అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. తన చిన్న కుమారుడు జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు దాత మురళి మోహన్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు యథావిధిగా రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - వేంపల్లె

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సెలవు రోజులైన శనివారం, ఆదివారం కూడా యథావిధిగా రైతులు, ప్రజలు తమ భూములకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, కాబట్టి భూములకు, ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ సాకే. ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు రోజు లాగే తమ భూములకు, ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు తరలి రావాలని కోరారు. రెవెన్యూ శాఖలో రీ సర్వే ద్వారా ఏర్పడిన ఎల్‌పిఎం నెంబర్లకు సంబంధించి ప్రభుత్వం డిసెంబర్ – జనవరి నెలలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలలో రైతుల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించిన తరువాత 16 నెలలుగా రిజిస్ట్రేషన్లకు నోచుకోని వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలంలోని ముత్తుకూరు, నాగూరు, రామిరెడ్డిపల్లి పెండ్లూరు, చీమలపెంట, సి.గొందిపల్లె, ఆమని విశ్వనాథపురం, అద్దాలమర్రి, అంజనేయపురం, గోనుమాకులపల్లె, తంగేడుపల్లె, మొయిళ్ళచెరువు గ్రామాలకు కలెక్టర్, కడప జిల్లా రిజిస్ట్రారు పివి ఎస్ బాబు, కడప డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ వివిఎస్ ఆర్‌కె ప్రసాద్, ఆర్‌డిఒ, తహశీలార్లు ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో రిజిస్ట్రేషన్లు కానివి కూడ ప్రస్తుతం చేస్తామని చెప్పారు. వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల గ్రామ పంచాయతీ నుంచి వేరుకాబడిన గంగిరెడ్డిపల్లి గ్రామాల్లోని భూములు కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి అడ్డంకులు పోయినట్లు చెప్పారు. వేంపల్లెలోని ప్రజలు, రియల్టర్లు, రైతులు, లే ఆవుట్ వెంచర్ యజమానులు, సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన చిన్నకారు, సన్నకారు రైతులు, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొన్న వారు, క్రయ విక్రయాలు జరుపుకొనే వారు, స్థిరాస్తులను తమ కుమారులకు, భార్యకు, కుమార్తెలకు పొలాలు, స్థలాలు, ఇల్లు దానంగా ఇచ్చే వారు ఈనెల 8,9 తేదీలలో రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పని వేళల్లో సంప్రదించి తమ ఆస్తులను రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. అ అవకాశాన్ని ప్రజలు, రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మల్లేలలో భేటీ బచావో-భేటీ పడావో

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని మల్లేల గ్రామం అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో 'భేటీ బచావో-భేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లల శాతం గణనీయంగా తగ్గుతుందని, అక్రమ గర్భస్రావాలు చేయించడం చట్ట రీత్యా నేరమని, అబ్బాయి కావాలని ఆడ శిశువులను స్కానింగ్ ద్వారా తెలుసుకొని భ్రూణ హత్యలు చేయించడం అమాను షమని చెప్పారు. ఈ చర్యల వల్ల సమాజంలో ఆడ, మగల మధ్య అసమా నతలు ఏర్పడి స్త్రీల పై అఘాయిత్యాలు అధికమవుతాయని పేర్కొన్నారు. కార్య క్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.